


భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0 - కనిష్ఠం : 25.0
తణుకు : 34.0 - 25.0



వివరాలు చెబుతున్న జనసేన, టీడీపీ కౌన్సిలర్లు

ఎమ్మెల్యే టచ్‌లోకి 20 మంది వైసీపీ కౌన్సిలర్లు

నరసాపురం, సెప్టెంబరు 21 : 'నరసాపురం మునిసిపాలిటీలో వైసీపీకి చెందిన 15 నుంచి 20 మంది కౌన్సిలర్లు మా ఎమ్మెల్యేతో టచ్‌లో ఉన్నారు. వారిని తీసుకోవాలా.. వద్దా అన్నది మా ఎమ్మెల్యే నిర్ణయం తీసుకుంటారు' అని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరావు, టీడీపీ కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, జనసేన కౌన్సిలర్లు కొప్పాడి కృష్ణవేణి, సూర్యకుమారి, భరత్ స్పష్టం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 'ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌పై చైర్‌పర్సన్ వెంకటరమణ, వైసీపీ కౌన్సిలర్లు, నాయకుల ఆరోపణలను ఖండిస్తున్నాం. ప్రొటోకాల్‌పై మాట్లాడే అర్హత చైర్‌పర్సన్‌కు లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష కౌన్సిలర్లకు చైర్‌పర్సన్‌గా మీరిచ్చిన గౌరవం ఏమిటి ? మునిసిపాల్టీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. త్వరలో వీటిని సాక్ష్యాధారాలతో బయటపెడతాం. కూటమి పార్టీలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తే ఊరుకోం. అన్న క్యాంటీన్‌ను ప్రారంభించకుండా ఉద్దేశ పూర్వకంగానే లేనిపోని గొడవలు సృష్టించి నిలుపుదల చేసేందుకు కుట్ర పన్నారు' అని ఆరోపించారు.



తడి, పొడి చెత్తపై ప్రజలకు మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అవగాహన

భీమవరంలో ఖాళీ స్థలాలకు నోటీసులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 21 : 'భీమవరంలో ఖాళీ స్థలాలు చెత్తకు నిలయాలుగా మారుతున్నాయి. వాటిని గుర్తించి పరిశుభ్రంగా చూసుకోవాలని యజమానులకు నోటీసులు ఇవ్వండి. వీటికి స్పందించకపోతే స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి' అంటూ మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం 27వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. 'వార్డులో ఎక్కడైనా అనధికారికంగా నిర్మాణాలు జరిగినా వెంటనే నా దృష్టికి తీసుకురండి. వాటికి నోటీసులు ఇచ్చి తక్షణం తొలగించేలా చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, అందే రామలింగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ష్.. గప్‌చుప్

వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు గ్రంధి, చెరుకువాడ వ్యూహాత్మక మౌనం

- పార్టీ అధినేత వైఎస్ జగన్ సమావేశానికి గైర్హాజరు
- పార్టీని వీడనున్నారంటూ ప్రచారం
- మేకా శేషుబాబు సస్పెన్షన్‌తో ఒక వర్గం దూరం

సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. పార్టీ శ్రేణులు నిరాశ నిస్పృహల్లోకి వెళ్లిపోగా, ముఖ్య నాయకులు వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. పార్టీ అధినేత జగన్ ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా మాజీ అధ్యక్షుడు చెరుకువాడ రంగరాజు, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గైర్హాజయ్యారు. అదే సమావేశంలో జిల్లా నాయకత్వాన్ని మార్చేసి, తనకు విశ్వసనీయంగా ఉండే నర్సాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజును జిల్లా అధ్యక్షుడిగా నియమించారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎన్నికల తర్వాత పార్టీతో అంటీముట్టనట్టు ఉంటున్నారు. ఎన్నికల రోజునే భవిష్యత్తును అంచనా వేసుకున్నారు. కష్టపడ్డాం. ఫలితం ఎలా ఉంటుందో చెప్పలేమంటూ చెప్పేశారు. ఫలితాలు వెలువడినంత వరకు కేడర్‌కు అందుబాటులో లేరు. అనుకున్నట్టే భీమవరంలో దారుణ ఓటమిని చవిచూశారు. అప్పటి నుంచి గ్రంధి ముభావంగా ఉంటున్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి దూరంగా ఉన్నారు. భీమవరంలో జగన్ పార్టీలో సమాంతర వ్యవస్థను నడుపుతున్నారన్న భావన గ్రంధిలో బలంగా నాటుకుంది. గడచిన ఎన్నికల్లో ఒక వర్గం నుంచి తనకు సహకారం అందలేదంటూ గట్టిగా నమ్ముతున్నారు. ప్రధానంగా మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు ప్రాధాన్యం ఉంటుందంటూ గ్రంధి వర్గం విశ్వసిస్తోంది. నిజానికి వైసీపీ ప్రభుత్వంలో మంత్రి పదవి ఆశించి గ్రంధి భంగపడ్డారు. 2019 ఎన్నికల్లో జనసేనాని పవన్ కల్యాణ్‌ను ఓడించిన తనకు ప్రభుత్వంలో సముచిత స్థానం ఉంటుందని ఆశించారు. ఆయనపై రాజకీయంగా తారస్థాయిలో విమర్శలు చేశారు. అయినా జగన్ చివరి నిమిషంలో విప్‌ను ఇస్తూ సరిపెట్టింది. ఇవన్నీ ఇప్పుడు గ్రంధి నెమరవేసుకున్నట్టు కనిపిస్తోంది.

అంజిబాబు ఫార్ములా బెటరా ?

కొన్నాళ్లపాటు మౌనంగా ఉండడమే బెటర్ అన్న భావనలో గ్రంధి ఉన్నట్టు ఆయన ముఖ్య అనుచరులు చెపుతున్నారు. గతంలో అంజిబాబు ఐదేళ్లపాటు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అభిమానులు, కార్యకర్తలు తన వద్దకు వస్తే పనిచేసి పెడుతుండేవారు. చివరి నిమిషంలో కూటమి అంజిబాబుకు టిక్కెట్ ఇచ్చింది. ఐదేళ్లపాటు ఎక్కడా వివాదాలు జోలికి పోలేదు. అదే ఫార్ములాను ఇప్పుడు గ్రంధి అనుసరిస్తారన్న వాదన వినిపిస్తోంది. ఎన్నికల సమయంలో ప్రజల నాడి, పార్టీల ప్రాబల్యానికి అనుగుణంగా ముందడుగు వేయవచ్చన్న రీతిలో ఉన్నారు. టీడీపీలో చేరే అవకాశం ఉందంటూ నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది. జిల్లాలో ఓ ఎమ్మెల్యే ఇందుకు సహకరిస్తున్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌లో టీడీపీ ముఖ్య నాయకత్వంతో గ్రంధి సమావేశమైనట్టు సమాచారం. ఏం జరుగుతుందో చూడాలి.

చెరుకువాడ ఎటు వైపు ?

పార్టీ అధినేత జగన్ నిర్వహించిన సమావేశానికి ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ రంగనాథరాజు వెళ్లకపోవడం వెనుక రాజకీయ కారణాలున్నాయి. పార్టీ ఆవిర్భావం దినోత్సవం తర్వాత దూరంగా ఉంటున్నారు. కార్యకర్తలకు తప్ప తన అనుచరులకు మాత్రమే ఆయన అందుబాటులో ఉంటున్నారు. వ్యాపారపరంగా తన దృష్టి కేంద్రీకరించారు. వ్యాపారంలో ఆరితేరిన రైస్ మిల్లింగ్‌పై మళ్లీ ఆసక్తి చూపుతున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు 2029లో నిర్వహిస్తారు. అప్పటికి నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరుగుతుంది.



అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరుగుతుంది. అప్పుడు ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఉంటుంది. అవసరమైతే రాజకీయ వారసునిగా తనయుడిని రంగంలో దింపేందుకు అవకాశాలు వున్నాయి. తాను ప్రాతినిధ్యం వహించిన ఆచంటకంటే ఇతర నియోజవర్గాల్లో అతనికి కాస్త పట్టు ఉంది. ఏదో ఒక మండలంలో రంగరాజుకు అనుచర వర్గం ఉంది. ఇది రానున్న ఎన్నికల్లో కలిసి వస్తుందంటూ ఆయన అనుచరులు బలంగా నమ్ముతున్నారు. రాజకీయ వ్యూహంలో భాగంగానే జగన్ నిర్వహించిన సమావేశానికి రంగరాజు దూరంగా ఉన్నారన్న వాదన వినిపిస్తోంది. ఇద్దరు మాజీలు గైర్హాజరు కావడమే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

పాలకొల్లులో కలకలం

పాలకొల్లుకు చెందిన జడ్పీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తనను ఎందుకు సస్పెండ్ చేశారో చెప్పాలంటూ అనుచర వర్గం ధర్నా చేసింది. పాలకొల్లులో వైసీపీ ఓటమికి శేషుబాబు ఒక కారణమంటూ అధిష్టానం చెబుతోంది. వాస్తవానికి అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ ఇదే తరహా ఓటమిని చవిచూసినా శేషుబాబును సస్పెండ్ చేయడంతో ఒక వర్గం వైసీపీకి దూరమైంది. తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ నాయకత్వాన్ని కార్యకర్తలు విశ్వసించడం లేదు. తణుకులోనూ అదే దుస్థితి. పార్టీ జెండా మోసేవారు కరువయ్యారు. ఉండి విషయానికొస్తే వైసీపీ కార్యకర్తలు కూటమి నేతలతో టచ్‌లో ఉంటున్నారు. ఇలా అన్ని నియోకవర్గాల్లోనూ వైసీపీ పరిస్థితి దయనీయంగా మారింది.



భీమవరంలో నిరసన తెలుపుతున్న బ్రాహ్మణ సమాఖ్య నాయకులు

తిరుపతి లడ్డూ కల్తీపై జనాగ్రహం

జిల్లాలో ర్యాలీలు, జపాలతో నిరసనల వెల్లువ

భీమవరం టౌన్/మొగల్తూరు, సెప్టెంబరు 21: హిందూ దేవాలయాల పవిత్రతను కాపాడాలని, తిరుమల-తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలను దెబ్బ తీసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శ్రీ ఉమా సోమేశ్వర గునుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల ప్రసాదాల్లో వినియోగించే పదార్థాలను పరీక్షించాలని డిమాండ్ చేశారు. హిందూ ఆలయాల పరిరక్షణకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పినట్లు సనాతన ధార్మిక సమితిని ఏర్పాటు చేసి హిందూ ఆలయాల పవిత్రతను కాపాడాలని కోరారు. అధ్యక్షుడు వేలూరి హనుమకిరణ్, ఉపాధ్యక్షుడు వేలూరి శేషగిరి, కార్యదర్శి మారెళ్ళ అఖిలేష్, సహ కార్యదర్శి మధిర అయ్యప్పశర్మ, బ్రహ్మజోస్యుల సత్యప్రసాద్, చెరుకుపల్లి సంతోష్, చందూరి కామేష్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జపం, దీపారాధనతో నిరసన



లడ్డూ విషయంలో జరిగిన అపవిత్రతను తొలగించేందుకు, కల్తీ జరిగిన ప్రసాదాన్ని తినటమే కాకుండా పంచిపెట్టినందుకు పాప పరిహారార్థం శనివారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఉదయం 108 సార్లు వేంకటేశ్వరస్వామి జపం, సాయంత్రం ఇంటి గుమ్మం వద్ద దీపం వెలిగించి తమ పాపాలను పోగొట్టాలని ప్రార్థించారు. హిందువులందరూ సాయంత్రం వేళ దీపాలను వెలిగించారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు పాల్గొన్నారు. తిరుమల మహాప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యిని విని యోగించిన ఘటనను రాష్ట్ర అర్చక సమాఖ్య ఖండిస్తోందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దింటి పురుషోత్తమాచార్యులు తెలిపారు.



కొత్తోటలో భక్తుల కాగడాల ప్రదర్శన

తిరుమల-తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేసిందంటూ మొగల్తూరు మండలం కొత్తోటలో గ్రామస్థులు, హిందూ ధార్మిక సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కాగడాలతో నిరసన ర్యాలీ చేశారు. లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యికి బదులు జంతువుల కొవ్వును వినియోగించడంపై నిరసన తెలిపారు. నిజాన్ని నిగ్గు తేల్చి సంబంధిత వ్యక్తులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్తినేని శ్రీనివాస తాతాజీ, గట్టెం శ్రీను, మేడిద బాబ్జి, సత్తినేని విజయభాస్కరరావు, లింగం ఏడుకొండలు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ కోర్సుల ప్రవేశాలకు గడువు పొడిగింపు

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2024-25 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు తేదీ పొడిగించినట్లు డీఈవో జి.నాగమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో ఈ నెల 28 వరకు సమర్పించవచ్చన్నారు. రూ.200 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజును ఈ నెల 29 నుంచి 30వ తేదీ వరకు సమర్పించవచ్చన్నారు. 14 ఏళ్ల నిండి బడి బయట ఉన్న వారు, ఇంత వరకు చదువుకోని వారికి దీనిపై అవగాహన కల్పించాలని కోరారు.

నేటికీ ముంపులోనే..



సిద్దాపురం వైపు వెళ్లే రహదారిలోని చినకాపవరం మురుగుకాల్వపై ఐదు దశాబ్దాల క్రితం నిర్మించి వంతెన కూలేం దుకు సిద్ధంగా ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2009లో దీనికి ప్రత్యామ్నాయంగా కొత్త వంతెన నిర్మించింది. అయితే పాత వంతెన తొలగించకపోవడంతో నీటిపారుదల సరిగా జరకపోవడంతో వెనక్కి తన్నుతోంది. ఈ కారణంగా ఐదు కిలోమీటర్ల మేర పొలాలు, ఇళ్ల పరిసర ప్రాంతాలు నేటికి ముంపులోనే ఉన్నాయి. పాత వంతెనను తొలగిస్తే సమస్య పరిష్కారమవుతుందని రైతులు చెబుతున్నారు.

\- ఆకివీడు

చెత్త పన్ను రద్దు

- వైసీపీ హయాంలో పట్టణాల్లో ఒక్కో ఇంటికి రూ.60 వసూలు.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- రద్దు చేస్తామని ఎన్డీఏ కూటమి హామీ.. అధికారంలోకి రాగానే శాశ్వత విముక్తి

భీమవరం టౌన్, సెప్టెంబరు 21 : వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణాల్లో అమలు చేసిన చెత్త పన్ను నుంచి ప్రజలకు ఊరట లభించింది. తాడేపల్లిగూడెంలో రూ.90, మిగిలిన మునిసిపాల్టీలో నెలకు 60 రూపాయలు చొప్పున పన్ను వసూలు చేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పన్ను వసూళ్లను నిలిపివేయగా ఈ పన్ను రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలో మరొకటి నెరవేరింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ మునిసిపాల్టీకి జనాభా ప్రతిపాదికన చెత్త సేకరణకు వాహనాలను కేటాయించారు. జిల్లాలోని భీమవరానికి 34, తాడేపల్లిగూడెం 32, తణుకు 24, పాలకొల్లు 18, నరసాపురంలో 16 వాహనాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క వాహనానికి మునిసిపాల్టీ ప్రతి నెలా రూ.50 వేలు చెల్లించాలి. అంటే ఏడాదికి వాహనానికి రూ.6 లక్షల 72 వేలు చెల్లించారు. ఇంత చెల్లించినా ఈ వాహనాలు మునిసిపాలిటీవి కావు. ఏజెన్సీ ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. వాహనాల విలువ మూడు లక్షలు మాత్రమే ఉంటుంది. అయినా మునిసిపాల్టీలు వాహనానికి ఏడాదికి 6.72 లక్షలు చెల్లిస్తూ వచ్చింది. మునిసిపాల్టీలు సొమ్ము చెల్లించకపోతే రాష్ట్ర మునిసిపల్ ఉన్నతాధికారుల నుంచి చీవాట్లు ఎదురయ్యేవి. ఇప్పటికే భీమవరం మునిసిపాల్టీ రెండు కోట్ల వరకు చెల్లించాలి. చెత్త వాహనాలకు నెల వారీ వాయిదా చెల్లించకూడదని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దిశా నిర్దేశం చేశారు. కమీషన్ల కోసం చెత్త వాహనాలపై పెద్ద ఎత్తున నెల వారీ వాయిదాలను నిర్ధారించారు. ఆ సొమ్మును ప్రజల నుంచి వసూలు చేశారు. ప్రజలు పన్నులు చెల్లించకపోతే మునిసిపాల్టీ నిధుల నుంచి జమ చేసుకున్నారు.

వాహనాలపై స్పష్టత ఇవ్వాలి

చెత్త వాహనాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ప్రస్తుతం ఈ వాహనాలు ఏజెన్సీ నిర్వహణలో ఉన్నాయి. ఇప్పటికి వీటి వాయిదాలను మునిసిపాల్టీలు చెల్లించాలి. మునిసిపాల్టీలకు చెత్త సేకణకు కొత్త వాహనాల కొనుగోలు చేసుకునే ఆర్థిక స్తోమత ఉన్నప్పటికి గత ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా వాహనాలను సమకూర్చింది. ఫలితంగా అవి ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చెత్త పన్నును నిలుపుదల చేసిన పరిస్థితుల్లో వాహనాలపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించడంతో పాటు వాహనాలు మునిసిపాల్టీలకు అప్పగించేలా చర్యలు తీసుకుంటే వాటిపై ఆర్థిక భారం పడకుండా ఉంటుంది.





బాణసంచా అనుమతులు తప్పనిసరి : జేసీ

నరసాపురం రూరల్/మొగల్తూరు, సెప్టెంబరు 21: ప్రభుత్వ అనుమతి లేకుండా బాణసంచా సామగ్రి తయారుచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం నరసాపురం రూరల్ లక్ష్మణేశ్వరంలో బాణసంచా తయారీ చేసే యూనిట్ల కేంద్రాన్ని తనిఖీ చేశారు. 18 ఏళ్ల లోపు పిల్లల్ని తయారీ కేంద్రాల పనుల్లో పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్ అధికారులు తరచూ ముందుగుండు తయారీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. తహసీల్దార్ రాజరాజేశ్వరి, డీటీ సీతారత్నం, వీఆర్వో చిరంజీవి, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పు గ్రామంలో భూసమస్య పరిష్కారం కోసం రైతులతో సమావేశమయ్యారు. జేసీ మాట్లాడుతూ కాళీపట్నం భూ సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి, రైతులు మేడిద బాబ్జి, నడింపల్లి రామకృష్ణరాజు, రైతులు పాల్గొన్నారు.

ఎంఈవోల సంఘం రూ.12 లక్షల సాయం



తణుకు, సెప్టెంబరు 21: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లాలోని ఎంఈవోల సంఘం ఆధ్వర్యంలో శనివారం భీమవరంలోని కలెక్టర్ నాగరాణికు ఆర్‌జేడీ నాగమణి ఆధ్వర్యంలో 12 లక్షల 36 వేల 707 చెక్కును అందజేశారు. ఏడీ సంధ్య, తణుకు డీవైఈవో మురళీ సత్యనారాయణ, ఏపీహెచ్‌ఎంల జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీమన్నారాయణ, అధ్యక్షుడు నేలపాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాయడానికి వెళ్తూ అనంత లోకాలకు.. -7లో

గైర్హాజరీ వైద్యాధికారులకు నో వర్క్..నో పే

- కొనసాగుతున్న పీహెచ్‌సీల డాక్టర్ల సమ్మె

భీమవరం టౌన్/ఏలూరు అర్బన్/అత్తిలి, సెప్టెంబరు 21 : పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటా కోసం గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీ వైద్యాధికారులు చేస్తున్న ఆందోళన శనివారం 11వ రోజుకు చేరింది. జిల్లాలోని 34 పీహెచ్‌సీల్లో 68 మంది వైద్యులు ఉండగా రోజుకు 34 మంది మాత్రమే హాజరవుతున్నారు. ఏలూరు జిల్లాలో 93 మంది గైర్హాజరయ్యారు. విధులకు గైర్హాజరైన వైద్యాధికారులకు 'నో వర్క్ - నో పే' విధానాన్ని అమలు చేయాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నుంచి శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఉత్తర్వులందాయి. సమ్మెలో పాల్గొంటున్న డాక్టర్లు అందరికి సంబంధిత రోజులకు జీతంలో కోతపెట్టి బిల్లులు తయారు చేయాలని పీహెచ్‌సీల డీడీవోలను ఆదేశించారు. వైద్యాధికారుల సమ్మెతో క్షేత్ర స్థాయిలో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యామ్నాయ చర్యలను వేగవంతం చేసింది. విధులకు హాజరు కాని వైద్యులకు మెమోలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన చర్చల్లో రెండు రోజుల్లో జీవోపై స్పష్టత ఇస్తామని హామీ ఇచ్చి, ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో వైద్య సంఘం నాయకులు సోమవారం 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

వైద్యులు నిల్.. రోగులు ఫుల్

వైద్యుల సమ్మె కారణంగా అత్తిలి, మంచిలి పీహెచ్‌సీల్లో సేవలు స్థంభించాయి. ఎక్కడ చూసినా జ్వర పీడితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మండలంలోని 18 గ్రామాలకుగాను నూటికి 25 శాతానికి పైగా జ్వరాలతో బాధపడుతున్నారు. పలు రకాల వ్యాధులతో ఇబ్బంది పడేవారు ప్రభుత్వాసుపత్రులకు వెళితే వైద్యులు అందుబాటులో లేక తిరుగుముఖం పడుతున్నారు. ఫలితంగా ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి స్థాయికి మించి వైద్యం కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు కురవడం, దోమల ఉధృతి పెరగడం, నీటి నిల్వలు, పారిశుధ్య లేమి, తదితర కారణాలతో ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. అనుమానిత డెంగీ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ రెండు ఆరోగ్య కేంద్రాల్లో అధిక సంఖ్యలో జ్వరాల కేసులు నమోదైనట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే వైరల్ ఫీవర్ జ్వర పీడితులు నామమాత్రంగానే ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. టైఫాయిడ్, మలేరియా వంటి కేసులు ఎక్కువగానే ఉన్నాయి. వైద్యులు లేకపోవడంతో రోగులు వచ్చి తిరిగి వెళుతున్నారని, తమ వల్లయ్యే చికిత్స చేస్తున్నామని మంచిలి ఎంపీహెచ్ఈవో కె.శాంతమూర్తి తెలిపారు.



ఏలూరులో వైద్యాధికారుల ధర్నా, ప్రదర్శన



అత్తిలిలో వైద్యులు లేని ఓపీ గది

భక్తులతో శ్రీవారి క్షేత్రం కిటకిట



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 21: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన ద్వారకా తిరుమల శనివారం భక్తజనులతో కిట కిటలాడింది. స్వామి వారికి ఇష్టమైన రోజుకావడంతో వాతావరణం సరిగా లేకున్నా అధికసంఖ్యలో యాత్రికులు ఆల యానికి విచ్చేశారు. వారంతా స్వామివారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు12 వేలమంది వరకూ యాత్రికులు శ్రీవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

ఆక్వా యూనివర్సిటీలో 25 మంది చేరిక

నరసాపురం రూరల్, సెప్టెంబరు 21: ఆక్వా యూనివర్సిటీ అడ్మిషన్లకు నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్‌లో నరసాపురం కాలేజీలో 25 మంది చేరినట్లు డీన్ నీరజ చెప్పారు. మొత్తం 60 సీట్లు ఉన్నాయన్నారు. రెండోవ కౌన్సెలింగ్‌లో మొత్తం ఫుల్ అయ్యే అవకాశం ఉందన్నారు. మొత్తం 565 మంది ర్యాంకులు సాధించారన్నారు. వీరిలో 120 మందికి మాత్రమే అడ్మిషన్లు ఉంటాయన్నారు. నెల్లూరు జిల్లాతో పాటు నరసాపురంలోని కాలేజీలో కౌన్సెలింగ్ ద్వారా మొత్తం సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పురుషోత్తమ కుమార్

చట్టాలపై మరింత నైపుణ్యం పెంచుకోవాలి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 21 : మారుతున్న చట్టాలపై మరింత నైపుణ్యం పెంపొందించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయమూర్తులకు వివిధ చట్టాలపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ మాట్లాడుతూ వర్క్‌షాపుల వల్ల ఎంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని తెలియని విషయాలను తెలుసుకోవచ్చునన్నారు. ఈ వర్క్‌షాపులో 138 నెగోషియబుల్ ఇనుస్ట్రుమెంట్‌యాక్టు చట్టం, పరిధి, తీర్పులను అమలు పర్చడం, బాలలపై లైంగిక దాడులు, విచారణ, బాధితుల పరిహారం అనే అంశాలపై ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రరాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి శ్యాంసుందర్, రిటైర్డ్ జిల్లా జడ్జి కృష్ణయ్య, హైకోర్టు న్యాయవాది జంపన శ్రీదేవి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ ప్రారంభం



ప్రార్థనా శ్లోకాలు ఆలపిస్తున్న విద్యార్థులు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 21: సంస్కృతి సాంప్రదాయాలను కాపాడు తున్న సరస్వతి శిశు మందిరాలు అల నాటి గురుకులాలను తలపిస్తున్నాయని మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ళ వీరాస్వామి అన్నారు. స్థానిక సరస్వతి శిశుమందిరంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఎంఈవో ప్రారంభించారు. ప్రధానాచార్య బెజవాడ సూర్యలక్ష్మీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈవో పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉపాధ్యాయిని నందుల రమణి జ్యోతి ప్రజ్వలన చేశారు. సైన్స్ ఫెయిర్‌లో గణిత, వైజ్ఞానిక, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 15 పాఠశాలల నుంచి 224 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి జగదీష్, ఝాన్సీరాణి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శిశుమందిరం అధ్యక్షుడు వీవీ తిరుపతిరాజు, కార్యదర్శి బోడా సత్యజిత్ కుమార్ పాల్గొన్నారు.

24న అండర్-14, 17 స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 : ఈనెల 24న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-14, 17 జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు గోపాలపురం మండలం వాదాలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉదయం 8:30 గంటల నుంచి జరుగుతున్నాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ ఫారం, మిడ్‌డే మీల్స్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు. వివరాలకు పీడీ వెంకటేశ్వరరావు సెల్ నెంబర్ 79819 28003 నెంబ ర్‌ను సంప్రదించాలన్నారు.

మాజీ బ్యాంక్ మేనేజర్ నుంచి రక్షణ కల్పించాలి



మాజీ మేనేజర్‌పై ఆరోపణలు చేస్తున్న గ్రామస్థులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 21: బ్యాంక్ మేనేజర్ పని చేసిన సమయంలో పలు ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయిన మర్రిబంధంకు చెందిన దావులూరి ప్రభావతి వేధింపుల నుంచి తమకు రక్షణ కల్పించాలని పలువురు గ్రామస్థులు కోరారు. నూజివీడులో వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన అవిర్నేని పద్మాకరరావు, మండవ విజయలక్ష్మి, దోనవల్లి పద్మాకరరావు, దోనవల్లి వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ కిలేడీగా ప్రసిద్ధి గాంచిన ప్రభావతి గంగూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా అవకతవకలకు పాల్పడి సస్పెండ్ అయ్యిందన్నారు. ప్రభావతి బంధువులమైన తమను అక్కడి వారు ప్రశ్నించగా ఇదేమని అడిగినందుకు సొంత మేనమామనైన తనపైనే రేప్ కేసు పెడతానని ప్రభావతి బెదిరింపులకు దిగిందని కంభంపాటి సుజయరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సోదరికి రావాల్సిన వారసత్వ ఆస్తులను సైతం అక్రమంగా పొందిందని, ఆదేకాక ఆమె ఇంటి చుట్టుపక్కల వారిని సైతం బెదిరిస్తూ దాడులకు దిగుతోందని దీనిపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా రౌడీషీట్ కూడా నమోదైందని అయినా ఆమె పద్ధతి మార్చుకోలేదని వారు ఆరోపించారు. హనీట్రాపర్‌గా మారి రేప్ కేసులు పెడతానని మరి కొంత మందిని వేధిస్తోందని ఇందుకు సంబంధించి ప్రభుత్వ పెద్దల పేర్లు వాడుకుంటోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

రెండు కేజీల గంజాయి పట్టివేత

నరసాపురం, సెప్టెంబరు 21: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాత్రి గంజాయ్ తరలిస్తున్న ముగ్గురు యువకుల్ని అరెస్టు చేసి వారి నుంచి దాదాపు రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ముత్యాలరావు చెప్పారు. బస్టాండ్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో సోదా చేయగా గంజాయి బయటపడిందన్నారు ఎక్కడి నుంచి తీసుకొచ్చారు అన్న విషయాన్ని విచారిస్తున్నట్లు ఎస్సై చెప్పారు

దాళ్వాకు ఎంటీయూ 1426 వరి వంగడం

మార్టేరు వరిపరిశోధనా స్థానం రూపకల్పన



వరి పరిశోధనా స్థానంలో వరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

పెనుమంట్ర, సెప్టెంబరు 21 : మార్టేరు వరి పరిశోధనా స్థానం నుంచి ఎంటీయూ 1426 అనే నూతన రకాన్ని రూపొందించామని సహాయ సంచాలకులు డాక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు. శనివారం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రకం 120 రోజుల పంటకాలం కలిగి కేవలం 13.6 గ్రాముల వేయి గింజల బరువు కలిగి ఉండటం వల్ల తినడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. ఈ రకాన్ని ఈ దాళ్వా పంటకాలంలో చిరు సంచి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం మార్టేరు వరి శోధనా స్థానంలో డ్రోన్ అందుబాటులో ఉన్నదని, మండల వ్యవసాయ అధికారులు ఈ సమాచారాన్ని రైతులకు తెలియజేయాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరావు మాట్లాడుతూ కోతలు మొదలైన ప్రాంతాలలో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు సాగుచేస్తున్న అన్ని రకాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. పధాన శాస్త్రవేత్త (వరి) డా.ఎం.గిరిజారాణి మాట్లాడుతూ వివధ పురుగు మందులు, తెగులు మందుల కలయిక, చిరు సంచుల రకాల సమాచారం గురించి వివరించాలని తెలిపారు. కొందరు రైతులు ఈ నెలలో కూడా నారుమళ్ళు పోస్తున్నారని, దీనివల్ల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని, దానికి బదులుగా నవంబర్ మాసంలో దాళ్వా నారుమళ్ళు పోసుకోవచ్చని తెలిపారు. డా.ఎం.వి.కృష్ణాజీ పాల్గొన్నారు.

సార్వాలో ఎండాకు తెగులు

పరిశీలించిన వ్యవసాయశాఖ జేడీ

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

పెనుమంట్ర, సెప్టెంబరు 21 : నత్తా రామేశ్వరంలో వరి పొలంపై ఎండాకు తెగులు ఆశించిన పొలాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వర్లు పరిశీలించారు. శనివారం పెనుమంట్ర మండలం విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఎండాకులు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నెల 24వ తేదీ నుండి పొలం పిలుస్తోంది కార్యక్రమం మొదలవబోతున్నదని, శాస్త్రవేత్తలంతా తప్పనిసరిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రధాన శాస్త్రవేత్త (వరి) డా.ఎం.గిరిజారాణి మాట్లాడుతూ వివిధ పురుగు మందులు, తెగులు మందుల పిచికారిపై రైతులకు అవగాహన కల్పించారు.

వచ్చే నెల 30న ఉపాధ్యాయ ఓటర్ల తుది జాబితా

ఏలూరుసిటీ, సెప్టెంబరు 21: రాష్ట్ర శాసనమండలి తూర్పు, పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితా డ్రాఫ్టు పబ్లికేషన్ ఈనెల 24వ తేదీన విడుదల చేయబడుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఉపాధ్యాయ ఓటర్ల సమీకృత జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలపై గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అభ్యంతరాలను అక్టోబరు 30వ తేదీ నాటికి పరిష్కరించి తుది ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో కొత్తగా 2331 మంది క్లెయిమ్స్ అందజేయగా వాటిని పరిశీలించిన తర్వాత 2271 దరఖాస్తులను పరిష్కరించటం జరిగిందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 20 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితా పకడ్బందీగా, పారదర్శకంగా రూపొందించటంలో భాగంగా ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, రాజకీయ పక్షాల ప్రతినిధులైన రాజనాల రామ్మోహనరావు, రంభ కిషోర్ (కాంగ్రెస్) , నెరుసు నెలరాజు (బీజేపీ), ఎ.రవి , డీఎన్‌వీడీ ప్రసాద్ (సీపీఎం), ఎస్.అచ్యుతబాబు, యు బాలానందం (టీడీపీ), ఎన్.కాశీ నరేష్ (జనసేన) పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

ముగ్గురికి గాయాలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 21: వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బుట్టాయగూడెం మండలం వీరన్నపాలెం నుంచి ద్విచక్ర వాహనంపై వంకా పోతురాజు (50), వంకా దుర్గాప్రసాద్ (25), కోట సాయి (12) కలిసి ఒకే వాహనంపై జంగారెడ్డిగూడెం పట్టణంలోని గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి దర్శనం నిమిత్తం బయలుదేరి వచ్చారు. ఆలయంలో స్వామి వారి దర్శనం అనంతరం ద్విచక్ర వాహనంపై ఆలయ కొండ దిగుతుండగా ఘాట్ రోడ్‌లో టర్నింగ్ తిరుగుతుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చిన్నపాటి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ కు సమాచార మందించి క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి తరలించారు. ప్రమాద ఘటన స్థలాన్ని ఎస్సై ఎస్‌కె.జబీర్ పరిశీలించారు.

గోదావరిలో మునిగి వృద్ధుడి మృతి

కొవ్వూరు, సెప్టెంబరు 21: గోదావరిలో మునిగి వృద్ధుడు మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఏలూరు జిల్లా కొయ్యల గూడెం మండలం డిప్పకాయలపాడు గ్రామానికి చెందిన పొలుబోను వెంక ట్రావు(62) ఈ నెల 20న అనారోగ్యంగా ఉందని రాజమహేంద్రవరం వెళ్లి వైద్యం చేయించుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి వచ్చారు. తిరిగి ఇంటికి తిరిగి వెళ్లకపోవడంతో చుట్టు పక్కల వెతికారు. శనివారం కొవ్వూరు భక్తాంజ నేయ స్నానఘట్టం వద్ద మృతదేహం గోదావరిలో ఉందన్న సమాచారం తెలి యడంతో బంధువులు చూడగా వెంకట్రావుదిగా గుర్తించారు. మృతుడి కుమా రుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

రైలు నుంచి జారిపడి అస్సోం వాసి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 21 : వేగంగా వె ళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి అస్సోం వాసి మృతి చెందాడు. అస్సోంనకు చెందిన రామెన్ లింబో (44) తామ్రం నుంచి న్యూటిస్కియోకు వెళ్తున్న రైలు ఎక్కాడు. ఆ రైలు ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సీతంపేట రైల్వే గేటు సమీపంలో వెళ్తుండగా ఆ రైలు భోగీలో ఉన్న రామెన్ లింబో భోగీ గుమ్మంలోంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ పి సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో భద్రపరిచారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్‌లు సీజ్

మొగల్తూరు,సెప్టెంబరు 21: అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశా రు. ఇసుక లోడుతో ఉన్న ఈ ట్రాక్టర్‌లను మొగల్తూరులోని స్థానిక హైవే ఖాళీ ప్రదేశంలో పోలీసులకు అప్పగించేందుకు ఉంచారు. దీనిపై మొగల్తూరు ఎస్ఐ జి.వాసును వివరణ కోరగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను రెవెన్యూ అధికారులే సీజ్ చేశారని తమకు అప్పగించలేదన్నారు.

భార్యను హింసిస్తున్న అత్తింటివారిపై కేసు

ముసునూరు, సెప్టెంబరు 21: భార్యను హింసిస్తున్న భర్త, అతని బంధువులు ముగ్గురిపై ఏఎస్ఐ ఎస్.నాగభూషణరావు శనివారం కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన టిక్కోడియా క్రిస్టఫర్, ముసునూరు మండలం గోపవరానికి చెందిన గుడిసె పావని పూజిత ప్రేమించుకుని, పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. అయితే కొద్ది నెలలుగా భర్త క్రిస్టఫర్, అతని తమ్ముడు స్టీవెన్, అత్తమామలు నక్కా రమాదేవి, సుబ్బారావు తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారన్న బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 21: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద పార్క్ చేసిన తన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం గ్రామానికి చెందిన పట్టెల ప్రదీప్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూలై పదవ తేదీన పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రదీప్ కుమార్ మేనల్లుడు చికిత్స పొందుతుండగా పరామర్శించడానికి వచ్చి తన హెచ్‌ఎఫ్ డీలక్స్ ద్విచక్ర వాహనాన్ని ఆసుపత్రి బయట పార్కు చేసి లోపలికి వెళ్ళాడు. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చి చూడగా తన ద్విచక్ర వాహనం కనబడలేదన్నారు.ఇప్పటి వరకూ వాహనాన్ని పలుచోట్ల వెదకి కనబడక పోవడంతో శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జబీర్ తెలిపారు.

పరీక్ష రాయడానికి వెళ్తూ అనంత లోకాలకు..

బుల్లెట్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు.. ఇద్దరు బీటెక్ విద్యార్థుల మృతి

ఒకరిది విజయవాడ, మరొకరిది భీమవరం.. తుని మండలం ఎర్రకోనేరు వద్ద ఘటన



ప్రమాద దృశ్యం



నిరంజన్, రేవంత్(ఫైల్‌ఫొటో)

తుని రూరల్, సెప్టెంబరు 21: పరీక్ష రాసేందుకు విజయవాడ నుంచి విశాఖకు బుల్లెట్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను కారు రూపంలో మృత్యువు కబళించింది. తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడిన గంటకే ఇద్దరూ అనంత లోకాలకు వెళ్లిపోవడంతో వారికి కడుపుకోత మిగిలింది. కాకినాడ జిల్లా 16వ నెంబరు జాతీయ రహదారిపై తుని మండలం ఎర్రకోనేరు వద్ద శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు బీటెక్ విద్యార్థులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

పరీక్ష కోసం తెల్లవారుజామున పయనమై..

విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన నాదెండ్ల నిరంజన్(19), పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పోలిశెట్టి రేవంత్(19) ఇద్దరూ స్నేహితులు. వీళ్లు విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరికీ శనివారం మధ్యాహ్నం విశాఖపట్నంలో ఎంపీటీఎల్ పరీక్ష ఉండడంతో బుల్లెట్‌పై తెల్లవారుజామున విజయవాడ నుంచి బయల్దేరారు. అలా వస్తూ.. వస్తూ ఓచోట ఆగి తమ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి క్షేమంగానే వెళ్తున్నామని ఇరువురూ సమాచారం అందించారు. కాకినాడ జిల్లా తుని రూరల్ ఎర్రకోనేరు వచ్చేసరికి విశాఖపట్నం వెళ్తున్న కారు వీళ్ల బుల్లెట్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో వీళ్ల ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొట్టగా యువకులు ఇద్దరూ ఎగిరిపడ్డారు. హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్రంగా గాయపడ్డారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఇద్దరినీ అటుగా వెళ్తున్న వాహనదారులు చూసి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. తుని రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఇద్దరినీ స్థానికంగా తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాల పాలైన నాదెండ్ల నిరంజన్ ఆస్పత్రికి వెళ్లేసరికి మృతి చెందాడు. మరో యువకుడు పోలిశెట్టి రేవంత్ కూడా తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించా రు. అతడు కూడా మృత్యువుతో పోరాడి వెంటిలేటర్‌పై తుదిశ్వాస విడిచాడు. ఈ సంఘటనపై తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కారులో ప్రమాద సమయంలో ముగ్గురు ఉన్నారని, వారిని తప్పించే ప్రయత్నం జరుగుతోందని మృతుల కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

క్షేమంగా వెళ్తున్నామంటూ విగతజీవులుగా మారి..

భీమవరానికి చెందిన పోలిశెట్టి రేవంత్‌కు తల్లిదండ్రులు ఉండగా అతడి స్నేహితుడు నిరంజన్‌కు తల్లి ఒక్కరే ఉన్నారు. ఇటీవలే తండ్రి మృతి చెందగా తల్లి భవాని ఉన్న ఒక్క కొడుకును అపురూపంగా పెంచుకుంటున్నారు. తుని ఏరియా ఆస్పత్రివద్ద విగతజీవిగా ఉన్న కొడుకు మృతదేహాన్ని చూసి ఆమె బోరున విల పించింది. ప్రమాదానికి ఒక గంట ముందే క్షేమంగా వెళ్తున్నామని చెప్పాడని, కాసేపటికే కొడుకు కానరాని లోకాలకు వెళ్లాడని తెలిసిందని ఆమె రోదించారు.



పేరుపాలెం బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న కలెక్టర్ నాగరాణి

సముద్ర తీరాన్ని రక్షించుకుందాం

మొగల్తూరు/నరసాపురం రూరల్, సెప్టెంబరు 21: భూమండలంలో ముఖ్యవనరుల్లో సముద్రం ఒకటని, కాలుష్యం నుంచి జల, జీవరాశులను కాపాడాల్సిన అవసం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి సూచించారు. అంతర్జాతీయ తీర ప్రాంత పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం పేరుపాలెం బీచ్‌లో చేపట్టిన స్వచ్ఛ సాగర్- సురక్షిత సాగర్ కార్య క్రమానికి ఆమె హాజరయ్యారు. తీరం వెంబడి చెత్త, ప్లాస్టిక్, పర్యావరణ హానికరమైన ఇతర వ్యర్థాలను ఏరివేసే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సముద్రాలు లెక్కలేనన్ని జీవరాశులకు ఆశ్రయాన్ని ఇస్తూ భూమిపై వాతావరణాన్ని నియంత్రిస్తున్నాయన్నారు. తీర ప్రాంతాన్ని కూడా పరిరక్షించుకుంటే అనేక వేల పక్షి జాతులను పరిరక్షించు కోవచ్చన్నారు. బీచ్‌కు వచ్చే సందర్శకులు పడేసే వ్యర్థాలు కారణంగా తీర ప్రాంతాలు అపారిశుధ్యంగా తయారువుతున్నాయన్నారు. పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా 20 బోట్లతో గస్తీ ఏర్పాటు చేయాలని మత్స్య శాఖాధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి రామరా జు, కొవ్వలి రామ్మోహన్ నాయుడు, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చినలంక సముద్రం ఒడ్డున స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. చినలంక గ్రామస్థులతో పాటు వేములదీవి ఈస్ట్, వెస్ట్ గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు సముద్రపు ఒడ్డున ఉన్న చెత్తను తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించారు. సర్పంచ్ ఒడుగు ఏసు, టీడీపీ మండల అధ్యక్షుడు వాతాడి ఉమా పాల్గొన్నారు.

ముళ్లపూడికి పితృ వియోగం



వెంకటరత్నం పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మద్దిపాటి, బొలిశెట్టి

నల్లజర్ల, సెప్టెంబరు 21: జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు తండ్రి ముళ్లపూడి వెంకటరత్నం(76) శనివారం చికిత్స పొందుతూ మృతి చెందారు. అనారోగ్యంతో విజయవాడ రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందు తూ శనివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. టీడీపీ సీనియర్ నాయ కులుగా పార్టీకి అనేక సేవలందించారు. ఆయన భార్య విజయలక్ష్మి 2001లో నల్లజర్ల సర్పంచ్‌గా సేవలందించారు. ఆయన నాయకత్వ లక్షణాలను కుమారుడు బాపిరాజు అందిపుచ్చుకున్నారు. వెంకటరత్నం పార్థివదేహానికి ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకటరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వ రరావుతోపాటు ఈతకోట తాతాజీ, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీ రాంజనేయులు, చింతలపూడి నాయకులు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, యలమాటి శ్రీనివాసరావు, ఏలేటి సత్యనారాయణ, గొంటు ముక్కల వేణు నివాళులర్పించారు. వెంకటరత్నంకు బాపిరాజుతోపాటు మరో ఇద్దరు కుమారులు రామకృష్ణ, సురేంద్ర ఉన్నారు. ఆయన పార్థివదేహా నికి ఆదివారం ఉదయం 11 గంటలకు హిందూ శ్మశాన వాటికలో అంత్య క్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు.

ఏలూరుపాడులో పోలీస్ పికెటింగ్



ఏలూరుపాడులో పోలీసు పికెటింగ్ ఏర్పాటు

కాళ్ళ, సెప్టెంబరు 21 : ఏలూరుపాడులో ఫ్లెక్సీల తొలగింపు వివాదం నేపథ్యంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు వినాయకుడు, సాయిబాబా, నాగేంద్ర స్వామి ఆలయాలకు అడ్డుగా అంబే డ్కర్ విగ్రహం వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో పాటు నాగేంద్రస్వామి పుట్టపై కూర్చుని దూమపానం చేస్తున్నారని వాటిని తొలగించాలని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఫ్లెక్సీని పరిశీలించి స్వయంగా తొలగించారు. దీనిపై దళిత సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి మరొక ఫ్లెక్సీని అంబేడ్కర్ విగ్రహం కింద ఏర్పాటు చేశారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. దీనిపై ఎమ్మెల్యే రఘురామ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అంటే తనకు ఎంతో గౌరమన్నారు. గ్రామస్థులు ఎంతో పవిత్రంగా భావించే నాగేంద్రస్వామి పుట్టపై కూర్చుని కొందరు పొగతాగుతూ, ఉమ్మి వేయడం వంటి పనులు చేస్తున్న వీడి యోలు చూపించారన్నారు. కనీసం గుడిలోకి వెళ్ళడానికి కూడా వీలు లే కుండా అడ్డుగా ఫ్లెక్సీలు కట్టడంతో భక్తులు కిందకు వంగి ఆలయానికి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడటం గమనించానన్నారు. దేశనాయకుల విగ్రహా లను అడ్డు పెట్టుకుని హిందూ దేవాలయాలపై దాడికి పాల్పడితే సహిం చేది లేదన్నారు. గ్రామంలో కొంత మంది వ్యక్తులు ఎస్సీలు కాకుండా ఎస్సీలమని చెప్పుకుంటూ అట్రాసిటీ చట్టాన్ని ఉపయోగించుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, దీనిపై పోలీసు ఉన్నతా ధికారులను కలిసి వివరించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎస్సీలమని చెప్పుకుంటున్న సదరు వ్యక్తులు ఎస్సీలే కాదని వారికి ఎస్సీ సర్టిఫికెట్స్ ఎలా ఇచ్చారంటూ దానిని రద్దు చేయాలని గ్రామానికి చెందిన పలువురు జనసేన, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు కాళ్ళ తహసీల్దార్ నాగార్జు నను కలిసి వినతిపత్రం అందించారు. ఫ్లెక్సీల తొలగింపుపై ఉండి ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలని నరసాపురం అంబేడ్కర్ సెంటర్‌లో దళిత సంఘాలు శనివారం రాస్తారోకో చేశారు.

ఏలూరులో దృష్టి మళ్ళించి చోరీలు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 21 : ఏలూరులో క్షణాల్లో సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లు అపహరించుకుపోతున్నారు. హైదరాబాద్ నుంచి ఏలూరు కొత్త బస్టాండ్‌లో ఉదయాన్నే బస్సు దిగిన ఒక వ్యక్తిని క్షణంలో మాయమాటలు చెప్పి ఆయన సెల్‌ఫోన్ తస్కరించారు. బస్టాండ్‌లో బస్ కోసం ఎదురుచూస్తున్న ఒక మహిళ ముందు ఏవో పేపర్లు పడవేసి అవి మీవేనంటూ దృష్టి మళ్ళించి ఆమె పరుసును అపహరించారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో శనివారం ఒక ముఠా దృష్టి మళ్ళించి అక్కడ ఉద్యోగి సెల్‌ఫోన్ అపహరించుకుపోయారు. నగరంలో ఈ ముఠాలు సంచారం జరుగుతూనే ఉన్నాయి. రైతు బజార్లో కూడా చొక్కా జేబులో ఉన్న ఫోన్లను టవల్ అడ్డంపెట్టి, న్యూస్ పేపర్లు అడ్డంపెట్టో క్షణాల్లో తస్కరిస్తున్నారు. నగరంలో నేరస్తులపై నిఘా తగ్గిందని దీంతో బయట ప్రాంతాల నుంచి ఈ ముఠాలు వచ్చి దృష్టి మళ్ళిస్తున్నారని చెప్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వరుస చోరీలు.... జనం బెంబేలు

అత్తిలి, సెప్టెంబర్ 21 : మండలంలో వరుస చోరీలతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్ళల్లో చోరీలు మొదలుకొని ఆలయాలు, పంచాయతీ కార్యాలయాలు ఇలా ఏ ఒక్క ప్రదేశం వదలకుండా దుండగులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. కొన్ని నెలలుగా వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తిరుపతిపురం శివారు శివాపురం ఇంట్లో పట్టపగలే దొంగతనం జరగ్గా, మంచిలి డప్పింగ్ యార్డు వద్ద రాత్రి సమయంలో నాలుగు లక్షల 50 వేలు విలువ చేసే బంగారం దోచుకుపోయారు. పాలి పంచాయతీకి సంబంధించిన చెత్త రిక్షాలు బ్యాటరీలు ఎత్తుకు పోయారు.


తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు విరాళాలిస్తున్న దాతలు


కలెక్టర్‌కు విరాళం చెక్కు అందిస్తున్న తాడేపల్లిగూడెం సెంట్ ఆన్స్ కరస్పాండెంట్ విజయ్‌కుమార్


కలెక్టర్‌కు విరాళం చెక్కు అందిస్తున్న తణుకు బెల్ వెదర్ కరస్పాండెంట్ దీపక్ కుమార్

కష్టకాలంలో ఆదుకునేందుకు..

భీమవరంటౌన్, సెప్టెంబరు 21 : భీమవరం, తాడేపల్లిగూడెం సెంట్ ఆన్స్ రూ. 4 లక్షలు, తణుకు బెల్ వెదర్ విద్యాసంస్థలు రూ.2 లక్షలు చొప్పున మొత్తం రూ.6 లక్షల విరాళాన్ని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ నాగరాణి కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ అభినందించారు. తాడేపల్లిగూడెం సెంట్ ఆన్స్ కరస్పాండెంట్ ఎ.విజయ్ కు మార్, తణుకు బెల్ వెదర్ కరస్పాండెంట్ ఎ.దీపక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

• భీమవరం టౌన్ : భీమవరం ఆక్వా ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజయవాడ వరద బాధితులకు రూ.మూడు లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ నాగరాణిని కలిసి సీఎం సహాయ నిధికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ అభినందించారు.

• పెనుమంట్ర : పెనుమంట్ర ద్వారంపూడి సుబ్బిరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ, ఆంధ్ర అసోసియేషన్ యూకే జూనియర్ కళాశాల రూ.32,123 చెక్కును ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు అందజేశారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ తమనంపూడి రామారెడ్డి, ట్రెజరర్ సత్తి సత్యానందరెడ్డి, కళాశాల సభ్యులు ద్వారంపూడి నాగిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రకాష్, సత్తి వెంకటసోమిరెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• తాడేపల్లిగూడెం అర్బన్ : వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపు మేరకు శనివారం పలువురు విరాళాలు అందజేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ నేతృత్వంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు రూ. 11లక్షల 2వేల 398, ఆంగ్లో ఇండియన్ స్కూల్ నుంచి రూ. 2.50 లక్షలు, అలంపురం గ్రామస్థులు రూ. 2 లక్షలు, పడాల జనసేన నాయకులు రూ.38 వేలు, పెంటపాడు గ్రామస్థుడు బండారు సత్యనారాయణ రూ. 25,020లు, జట్లపాలెం నుంచి బండి పెద్దిరాజు రూ. 25 వేలు, పడాల విలేజ్ ఐక్య సంఘం నుంచి రూ. 12 వేలు విరాళం అందజేశారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ

• తాడేపల్లిగూడెం రూరల్ : నందమూరు సర్పంచ్ శనగన వరలక్ష్మి, రాంబాబు వరద బాధితులకు రూ.15 వేలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సర్పంచ్ దంపతులను అభినందించారు. జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ పాల్గొన్నారు.

• వీరవాసరం, (భీమవరంటౌన్) : వరద బాధితుల సహాయార్థం కొణితివాడ గ్రామం నుంచి కొంతమంది దాతల సాయంతో 3లక్షల 50 వేల రూపాయిలను శనివారం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబుకు అందించారు. పద్మాలయ ఇంగ్లీషు మీడియం స్కూల్ వారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి రూ.లక్ష ఎమ్మెల్యేకు అందిచారు

• భీమవరంటౌన్ : వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం ది.కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, భీమవరం రూ.లక్ష సహాయాన్ని ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు.

ఆకివీడులో పునరావాసులకు భోజనాలు

ఆకివీడు, సెప్టెంబరు 21 : విపత్తు ఏర్పడి రెండు వారాలు గడుస్తున్నా వరద నీరు నేటికి తగ్గకపోవడం బాధాకరమని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఆకివీడు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాసులకు శనివారం నరేంద్ర మోదీ, గోకరాజు గంగరాజు సేవా సమితి ఛైర్మన్ నేరెళ్ళ పెదబాబు ఆర్థిక సహకారంతో బాధితులకు భోజనాలు అందజేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు-సెక్రటరీ శింగలూరి చిట్టిబాబు, బొమ్మి యశోధకృష్ణ, జిల్లా నాయకుడు సన్నిధి మాణిక్యాలరావు, పట్టాభి, రమణ ఉన్నారు.


కలెక్టర్‌కు రూ.3 లక్షల చెక్ అందిస్తున్న భీమవరం ఆక్వా ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు


ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు విరాళం అందిస్తున్న సర్పంచ్ శనగన వరలక్ష్మి, రాంబాబు


ఆకివీడులో పునరావాసులకు భోజనాలు వడ్డిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు


ప్రత్తిపాడులో రైతులకు మినుములు అందజేస్తున్న బొలిశెట్టి, వలవల, ఈతకోట


నత్తారామేశ్వరంలో మంచి ప్రభుత్వంపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పితాని


పిప్పరలో ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని

హామీల అమలుతో సత్తాచాటిన కూటమి

పెంటపాడు, సెప్టెంబరు 21: అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి సత్తా చాటుకుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం ప్రత్తిపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు వలవల బాబ్జి మాట్లాడారు. అనంతరం సబ్సిడీపై రైతులకు మినుములు అందజేశారు. కూటమి అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దత్తు ప్రసాద్, దాసరి అప్పన్న, చెరుకూరి జగత్‌సోమశేఖర్, ఏడీఏ మురళీకృష్ణ, ఏవో పార్థసారధి, తహసీల్దార్ శ్రీనివాస్, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

• పెనుమంట్ర/ఆచంట/పోడూరు :ఐదేళ్లలో అభివృద్ధి శూన్యమని.. అప్పుల రాజ్యం కొన సాగిందని ఆ రాజ్యానికి అప్పుల మహారాజు జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ విమర్శించారు. శనివారం ఉదయం పెనుమంట్ర మండలం నత్తా రామేశ్వరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అప్పు చేయకుండానే సూపర్ సిక్స్ పథకాల అమలు చేసేలా ప్రయత్నిస్తామన్నారు. వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం చేయాలనేదే ఇది మంచి ప్రభుత్వం లక్ష్యమన్నారు. సర్పంచ్ వెలగల దర్మా రెడ్డి, ఎంపీటీసీ టీఎం రెడ్డి, తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీడీవో పి.పద్మజ, పార్టీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆచంట మండలం కొడమంచిలిలో ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమం జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు , ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి ఆధ్వర్యంలో జరిగింది. ఎంపీడీవో పి.నరసింహప్రసాద్, మన్నె బాబు, చిలుకూరి శ్రీను, బాలం వెంకటరమణ, చిలుకూరి పట్టాభి, రాము పాల్గొన్నారు. పోడూరు మండలం తూర్పుపాలెం, మినిమించిలి పాడు, కొమ్ముచిక్కాల గ్రామాల్లో పోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారులు జీవీ.సూర్యనారాయణ, ఆచార్యులు, సర్పంచ్ గుంటూరి రామకృష్ణంరాజు, నాయకులు గొట్టుముక్కల రఘురామరాజు, కొసన అబ్బులు, గుంటూరి రాజా తదితరులు పాల్గొన్నారు.

• ఉండి: ఉండి మండలం కలిగొట్ల గ్రామంలో నరసాపురం పార్లమెంటు ఐటీడీపీ కార్యదర్శి యశోధకృష్ణయ్య ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐటీడీపీ కార్యదర్శి యశోధకృష్ణయ్య మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. సర్పంచ్ ఎంఎస్, ప్రసాద్, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

▸▸ 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు

హామీలు నెరవేరుస్తాం : ఆరిమిల్లి

అత్తిలి : సూపర్ సిక్స్ పథకాల వాగ్దానాన్ని అమలు చేస్తామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అత్తిలి పంచాయతీ కార్యాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌ను రూ. నాలుగు వేలకు పెంచామని, ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామన్నారు. తనను ఆదరించిన అత్తిలి గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు.

100 రోజుల పాలన ప్రగతి పథం వైపు : గన్ని

గణపవరం:కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వందరోజుల్లో చేసిన అభివృద్ధి ప్రగతిపథం వైపు పయనిస్తుందని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. శనివారం పిప్పరలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పార్టీ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి ఇంటింటికి అందజేశారు. గణపవరం మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, యాళ్ళ సుబ్బారావు, కానుమిల్లి చంటి పాల్గొన్నారు. సరిపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ క్రొవ్విడి సాయి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రామాంజ నేయులు పాల్గొన్నారు.


అత్తిలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

• భీమవరంటౌన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో వంద రోజుల్లో అనేక అద్భుతాలు చేసిందని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. వీరవాసరం మండలం నేలపోగుల గ్రామంలో కూటమి ప్రభుత్వ పాలన వంద రోజుల పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని, కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయమే లక్ష్యం : మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 21 : రైతులకు లాభసాటి వ్యవసాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈనెల 24నుంచి వ్యవసాయశాఖ నిర్వహించే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయశాఖాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం సంపాదించేలా వ్యవసాయశాఖ రూపొందించిన ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఈ.అనిల్‌కుమార్, ఏడీఏ పార్వతి, జి.సత్యనారాయణ, కె.రాజశేఖర్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

తాడేపల్లిగూడెం అర్బన్/తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 21: అధికారులంతా సమన్వయంతో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత వైసీపీ పాలనలో మున్సిపాలిటీ నిర్వీర్యమైపోయిందని, గతంలో రాజీనామా చేసిన వలంటీర్లను తీసుకునే అవకాశం లేదని, రాజీనామా చేయని వారి సేవలను సచివాలయాలలో వినియోగించుకుంటామన్నారు. ఆర్డీవో వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి కమీషనర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మ ఆశీస్సులు అందరికీ అందాలి

తాడేపల్లిగూడెం గ్రామదేవత బలుసులమ్మ ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. తాడేపల్లిగూడెంలోని బలుసులమ్మ ఆలయం వద్ద దసరా వేడుకల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కూటమి నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, గుండుమోగుల సురేష్, ఉత్సవ కమిటీ నాయకుడు శ్రీరంగం అంజి పాల్గొన్నారు.

'ప్రపంచ శాంతిని కాంక్షించాలి'

ఉండి, సెప్టెంబరు 21 : ప్రపంచ శాంతిని కాంక్షించాలని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. శనివారం చెరుకువాడ హైస్కూల్‌లో ప్రపంచ శాంతి దినోత్సవం పురస్కరించుకుని ఉండి లయన్స్, ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. గాదిరాజు వెంకటేశ్వరరాజు, ఆర్.సుబ్బరాజు, హరినాథరాజు, కాగిత మహంకాళి, పాఠశాల హెచ్ఎం పార్వతీదేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్/అత్తిలి/మొగల్తూరు, సెప్టెంబరు 21: బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయని తాడేపల్లిగూడెం మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెల శ్రీధర్ అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని 19, 17, 14వ వార్డుల్లో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా శనివారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అత్తిలి మండలం మంచిలి ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీవో ప్రమోదకుమారి ఆధ్వర్యంలో సీమంతాలు నిర్వహించారు. మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామంలోని ఇందిరా కాలనీలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి అనంతరం ర్యాలీ నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం..

• **భీమవరంటౌన్, సెప్టెంబరు 21 :** నట సామ్రాట్ పద్మశ్రీ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ విడుదల చేయడంపై శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం హెడ్ పోస్టాఫీస్‌లో హెడ్ పోస్టమాస్టర్ రాజు హర్షం ప్రకటించారు.

• **నరసాపురం :** ప్రముఖ రచయిత గుర్రం జాషువా జయంతి పురస్కరించుకుని స్కూల్, కాలేజీ విద్యార్థులకు సోమవారం నుంచి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు కమిటీ నిర్వాహకులు నాగేంద్ర త్రినాథ్ తెలిపారు.

• **భీమవరం అర్బన్ :** సీతారాం ఏచూరి మరణం కార్మిక వర్గానికి కష్ట జీవులకు తీరని లోటని సివిల్ సప్లై గొడౌన్ ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీతారం ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు నివాళి కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు అన్నారు.

• **భీమవరం అర్బన్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భీమవరం సీనియర్ సిటిజన్ ఫోరం కోశాధికారి, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు పేరిచర్ల లక్ష్మణవర్మ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

• **నరసాపురం రూరల్ :** సీతారాంపురం లేసు పార్కు సొసైటీ ఎన్నికలు ఈనెల 24న జరగనున్నాయి. ఇప్పటికే పార్కు పరిధిలో ఉన్న నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, వీరవాసరం, మొగల్తూరు మండలాలకు చెందిన 51 సొసైటీలకు ఎన్నికలు పూర్తయ్యాయి.

ఘనంగా 'గురజాడ' జయంతి వేడుకలు


భీమవరంలో తెలుగు ఉపాధ్యాయుడు సంధి ప్రేమరాజుకు సత్కారం

భీమవరం ఎడ్యుకేషన్/గణపవరం/భీమవరం టౌన్/పెంటపాడు/పాలకొల్లు, సెప్టెంబరు 21 : గురజాడ దేశభక్తికి, జాతికి మేలుకొలుపు అని అనాకోడేరు డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పాఠశాలలో మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. గణపవరం మండలం గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ప్రిన్సిపాల్ నిర్మలకుమారి ఆధ్వర్యంలో, భీమవరం బీవీ రాజు పార్కులోని తెలుగు తల్లి విగ్రహం వద్ద అరసవల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహాకవి అప్పారావు జయంతి కార్యక్రమాన్ని రచయిత కలిగొట్ల గోపాలశర్మ, జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ, డాక్టర్ కాకుమాని శ్రీనివాస్‌రావు, ట్రస్టు అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో, పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టీఎస్ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో, పాలకొల్లు వీవర్స్ కాలనీ మున్సిపల్ ఎలిమెంట్రీ స్కూల్‌లో హెచ్ఎం ఆర్. భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో, డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రవిశంకర్ ఆధ్వర్యంలో అప్పారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కబడ్డీ పోటీలకు దండగర్ర జట్టు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 21:స్కూల్ ఫెడరేషన్ మండల స్థాయి కబడ్డీ పోటీల్లో దండగర్ర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. క్రీడాకారులను ఎంఈవో వి. హనుమ, సర్పంచ్ పిల్లా రాంబాబు, హెచ్ఎం చంద్రశేఖర్, వ్యాయామోపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ అభినందించారు.

కోపల్లె హైస్కూలులో ఆటల పోటీలు ప్రారంభం

కాళ్ళ, సెప్టెంబరు 21 : స్కూల్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల విద్యాశాఖ అధికారులు రవీంద్ర వెంకటేశ్వరరావు క్రీడలను శనివారం ప్రారంభించారు. మండలస్థాయి ఎంపికల్లో కలవపూడి, బొండాడ, దొడ్డనపూడి, కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాలల నుంచి అండర్-16, అండర్-17 విభాగాలలో వాలీబాల్, చెస్, ఖోఖో, కబడ్డీ ఆటల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పీటీలు పాల్గొన్నారు.

150 మంది విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 21 : ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా శనివారం యునైటెడ్ ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో పట్టణంలోని ఆయా పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీలకు న్యాయనిర్ణేతగా ప్రముఖ చిత్రకళాకారుడు ఉదయ్‌కుమార్ వ్యవహరించారు. పోటీల్లో గెలిపొందిన విజేతలకు మూర్తి జనరల్ స్టోర్స్, నరేష్ టెక్నాలజీకి చెందిన దాతలు బహుమతులు ప్రదానం చేశారు. డాక్టర్ ముచ్చర్ల సంజయ్, పెనుమాక రామ్మోహన్, అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, గాది ఆంజనేయులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మకు బంగారం అందజేత

భీమవరంటౌన్, సెప్టెంబరు 21 : మావుళ్ళమ్మ అమ్మవారికి భీమవరానికి చెందిన కె.శ్రీనివాసరోహిత్ ఆరు గ్రాముల బంగారం, పి.అచ్యుత రామరాజు రెండు గ్రాముల బంగారం అమ్మవారికి అందించారు. దాతలు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు

జిల్లా ఉత్తమ హెచ్ఎం వెంకట్రావుకు సత్కారం

భీమవరం అర్బన్, సెప్టెంబరు 21: జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు అవార్డు సాధించిన చినరంగనిపాలెం మున్సిపల్ హైస్కులు హెచ్ఎం కోడే వెంకట్రావును శనివారం భీమవరం కూటమి నాయకులు సత్కరించారు. టీడీపీ నాయకులు చెల్లబోయిన సుబ్బారావు, బొక్కా సూరిబాబు, గోవింద్, పాలా దాస్, బీజేపీ నాయకులు పితాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దళితపేటపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

భీమవరం అర్బన్ సెప్టెంబరు 21 : రాజమండ్రి జిల్లా కొవ్వూరు మండలం శ్రీరామకాలనీ దళితపేటపై కర్రలు, ఇటుకలతో మూకుమ్మడిగా దాడిచేసిన వ్యక్తులపై అట్రాసిటీ చట్టం ప్రకారం అరెస్టు చేయాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. పాలపర్తి జోనా, జె.మాణిక్యాలరావు, మునియ్య, గెడ్డం జార్జ్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

పెనుమంట్ర,సెప్టెంబరు 21 : నత్తా రామేశ్వరంలోని రామేశ్వరస్వామి దేవస్థానంలో దాతల సహకారంతో అభివృద్ధి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం నత్తారామేశ్వరంలోని రామేశ్వర స్వామి ఆలయాన్ని కుటుంబ సమేతంగా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి పూజల అనంతరం ఆశీర్వచనాలు అందజేశారు. సుమారు పది లక్షల రూపాయలతో రామేశ్వర స్వామి రాజగోపురానికి రంగులు వేయించిన దాత తాత కుంట్ల ఏలేశ్వరరావు దంపతులను శాలువాతో సత్కరించారు. కాల భైరవ స్వామి ఆలయాన్ని ఆధునికరించినందుకు తాతారెడ్డి ముందుకు రావడం సంతోషకదాయకమన్నారు. ఎంపీటీసీ టీఎస్ రెడ్డి, మాజీ సర్పంచ్ కర్రి సుబ్బారెడ్డి, కొక్కిరాల సత్యనారాయణ. మాజీ ఏఎంసీ ఛైర్మన్ నల్లమిల్లి నర్సిరెడ్డి, తమనంపూడి శ్రీనివాసరెడ్డి వెలగల బుల్లి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతిపై కార్యాచరణ హర్షణీయం

కాళ్ళ, సెప్టెంబరు 21 : ఎన్డీయే కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వేద పండితులకు ధూపదీప నైవేద్యాలు స్కీం కింద నిరుద్యోగ భృతి రూ.3000 పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో పెట్టడం హర్షణీయమని ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పొదిల నారాయణమూర్తి అన్నారు. ఏలూరుపాడులో శనివారం నిర్వహించిన పురోహిత బ్రాహ్మణ సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సమాఖ్య గౌరవ అధ్యక్షులు యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శనం దుర్గబాబు, వేలూరు సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు లాభాలే ధ్యేయంగా బీజేపీ పాలన

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 : ప్రజలపై భారాలు.. కార్పొరేట్లకు లాభాలే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. తోకతిప్ప గ్రామంలో శనివారం శాఖ మహాసభల సందర్భంగా పార్టీ మాజీ మండల కార్యదర్శి రేవు రామకృష్ణ జెండా ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్, నూనె ధరలు, నిత్యావసర సరుకులు ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్, బొడ్డు లక్ష్మీపతి, బొడ్డు ఏసు, తిరుమాని సూర్యనారాయణ, పొన్నమండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 21: మత్తు పదార్థాలకు బానిస కాకుండా విద్యార్థులు చదువుతో పాటు మిగిలిన రంగాల్లో రాణించాలని నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ సూచించారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 27, 28,29 తేదీల్లో నరసాపురం లయన్స్ క్లబ్ భవనంలో, భగత్‌సింగ్, మహాత్మాగాంధీ జయంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ధనుంజయ, చందు, ధీరజ్, సిరి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా అన్నసమారాధనలు


అన్నదానం ప్రారంభించిన మల్లినీడి తిరుమలరావు (బాబి)

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 21: చవితి ఉత్సవాల సందర్భంగా శనివారం పలు చోట్ల అన్నసమా రాధనలు, ఊరేగింపులు నిర్వహించారు. పట్టణంలోని 10వ వార్డులో జరిగిన అన్నసమారాధనలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పాల్గొని వడ్డన చేశారు. పట్నాల రాంపండు, ఎరుబండి సతీష్ ముప్పిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• భీమవరంటౌన్, సెప్టెంబరు 21 : వినాయక చవితి ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమం మహోన్నత కార్యక్రమం, అన్నదానం నిర్వహించడం అభినందనీ యమని జనసేన రాష్ట్ర ప్రొటోకాల్ ఛైర్మన్ మల్లినీడి తిరుమలరావు అన్నారు. 18వ వార్డు పేరంటాల చెరువుగట్టు వద్ద నవ చైతన్య ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే గణపతి పంచరాత్రుల ఉత్సవాల్లో భాగంగా భక్తులు దాతల సహకారంతో మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. జనసేన నాయకులు చనమల చంద్రశేఖర్, బండి రమేష్‌కుమార్, పత్తి హరివర్ధన్, ఎర్రంశెట్టి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

• భీమవరంటౌన్ : సంకటహర చతుర్థి సందర్భంగా గునుపూడిలోని విద్యా గణపతి స్వామి ఆలయంలో స్వామికి ఉదయం పంచామృత అభిషేకములు, సాయంత్రం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. స్వామికి యాతం ప్రతాప్‌కుమార్ దంపతుల సౌజన్యంతో విశేష పుష్పాలంకరణ చేశారు.


ఆకివీడు మూడో వార్డులో శుభ్రం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

ఆకివీడు/ఉండి/పెనుగొండ/తణుకు/భీమవరం టౌన్, సెప్టెంబరు 21 : పరిసరాల పరిశుభ్రంతోనే పర్యావరణ సంరక్షణ అని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆకివీడు మూడో వార్డులో ప్రజా ప్రతినిధులతో కలిసి చీపుర్లతో రోడ్లు ఊడ్చి మాట్లాడారు. టీడీపీ, జనసేన పట్టణ అధ్యక్షులు బొల్లా వెంకట్రావు, పిల్లా బాబులు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, వార్డు కౌన్సిలర్ మోపిదేవి సత్యవతి, ఉద్యోగులు ఉన్నారు. ఉండి మండలం పాములపర్రులో జనసేన మండల కన్వీనరు యడవల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కేశన యాదగిరి, తోట రాములు ఆధ్వర్యంలో మంచినీటి చెరువు వద్ద మొక్కలు నాటారు. పెనుగొండ మండలం వడలి గ్రామంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మి ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తణుకు రైల్వేస్టేషన్, బస్టాండ్ వద్ద పరిసరాలు పరిశుభ్రతపై కళాజాత నిర్వహించారు. తడి, పొడి చెత్త వినియోగం, ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించారు. భీమవరం మెప్మా ఆధ్వర్యంలో ఆర్‌పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో మునిసిపాల్టీ నుంచి కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

త్వరలో సిద్ధాంతం శ్మశాన వాటిక ఆధునికీకరిస్తాం

పెనుగొండ, సెప్టెంబరు21: సిద్ధాంతంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్మశాన వాటికను త్వరలో ఆధునికీకరిస్తామని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం పలు శాఖల అధికారులతో కలిసి శ్మశాన వాటికను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ శ్మశాన వాటిక అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. దేవదాయ శాఖ శ్మశాన వాటికకు సంబంధించిన స్థలం ఎంత మేరకు ఉన్నది. ఇరు శాఖ అధికారులు సమావేశం నిర్వహించుకుని సరిహద్దులు వెంటనే తేల్చుకోవాలన్నారు. మరో పది రోజుల్లో మళ్లీ అందరితో సమావేశం నిర్వహించి ఒక కమిటీని ఏర్పాటు చేసి త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఆచంట జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, వెలిచేటి బాబూరాజేంద్రప్రసాద్, ఉండవల్లి చిన్ని, తహసీల్దార్ అనిత కుమారి, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసదొర, అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికులను అన్ని విధాలా ఆదుకోవాలి

భీమవరం అర్బన్, సెప్టెంబరు 21 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూడకుండా.. గీత కార్మికులను అన్ని విధాలా ఆదుకోవాలని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అక్రమం మద్యం, కల్తీ మద్యం అమ్మే బడా వ్యాపారులతో సంబంధాలు ఉన్న ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆ శాఖను ప్రక్షాళన చేయాలని డిమండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామన మునిస్వామి, సహాయ కార్యదర్శి బొక్కా చంటి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు శుభపరిణామం

పెనుగొండ, సెప్టెంబరు 21 : గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, యాత కులస్థులకు బ్రాందీ షాపులలో పది శాతం రిజర్వేషన్ కల్పించడం శుభపరిణామమని మాజీ ఎమ్మెల్యే మల్లుల లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పెనుగొండ నగరేశ్వర, మహిషాసుర మర్ధని, వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంకు చెందిన కల్యాణ మండపంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మాణాలు సమావేశంలో ఆమోదించారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం రూరల్, సెప్టెంబరు 21: ఎల్‌బీచర్ల బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కాలేజీలో జూనియర్ లెక్చరర్ (గణితం)-గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.రాధాకృష్ణ తెలిపారు. పీజీ, బీఈడీ, టీఈటీ అభ్యసించిన అభ్యర్థులు అర్హులన్నారు. దరఖాస్తులను ఈనెల 24న కాలేజీలో అందించాలని ప్రిన్సిపాల్ కోరారు.